# విన్నపాలు

జానకీపతిగారు బయట ఆటో దిగి గేటులోంచి వస్తూనే, అక్కడే ఉన్న శ్రీకాంత్‌ని చూసి చిరునవ్వు నవ్వి "సిద్ధంగా ఉన్నారా అంతా?" అని అడిగారాయన.

ఆశీస్సులందుకున్న శ్రీ "వంగి.రండి. మీరు వస్తున్నారన్న వార్తే మాకు ఆనందం కలిగించింది. సిద్ధంగా ఉండమన్నాం. అందులోనూ మీ పద్ధతులు తెలుసుకదండీ!" అన్నాడు.

"మావయ్యగారికి కాళ్ళకి నీళ్ళివ్వాలి శ్రీ" అంది అన్నపూర్ణమ్మగారు.

"భలేవాడివే అమ్మా. ఆయనచిన్నపిల్లలా వీధిలోని దుమ్మంతా పట్టించుకొని వస్తారా ఏమిటి? ఇంటిదగ్గర ఆటో ఎక్కారు. ఆ కాలు ఈ న గేటుముందు దించారు. పూర్వకాలపు ఆచారాలూ నువ్వూను" అన్నాడు శ్రీకాంత్.

"పోనీలే శ్రీకాంత్, పట్టుకురా ఆవిడ తృప్తికి" అని అప్పుడు అన్నపూర్ణమ్మ వైపు తిరిగి "అంతా బాగున్నారా?" అనడిగాడు జానకీపతిగారు.

"బాగున్నాం మీ దయవల్ల. వదినగారు బాగున్నారా, [illegible] పురిటికి వెళ్ళారా?"

"ఎక్కడికీ వెళ్ళలేదు. నేనే వద్దన్నాను. పిల్లల వరకే మన బాధ్యత! మన వరకి మనవళ్ళకీ అంటారూ, వాళ్ళ తల్లి తండ్రులే బాధ్యులు. మనమల్లా అంతా బాగున్నారా, లేదా చూడడం వరకే" అని అప్పుడే వచ్చిన దుర్గని చూసి, "ఏమ్మా నువ్వెప్పుడు వచ్చావు?" అని అడిగారాయన.

"నమస్కారం మావయ్యగారు, నిన్ననే వచ్చానండి. ఆయనకి క్యాంపు ఉందిట, వాళ్ళ ఆఫీసరుతోపాటు. నన్నిక్కడ దింపి వెళ్ళారు. మీ శ్రీలక్ష్మి బాగుందా? అడిగానని చెప్పండి" అంది దుర్గాంబ.

"ఇక్కడ లేదుగా, రాగానే చెబుతాను నువ్వడిగావని. లేకపోతే ఉత్తరమైనా రాస్తాను నువ్వడిగావని. సరా!"

అందరూ లోపలికి చేరుకున్నాక శ్రీకాంత్ "అటు కూర్చోండి మావయ్యగారు" అంటూ కుర్చీ చూపించాడు.

"రిటైర్డ్ జడ్జిగారి సీటన్నమాట అది" అంది దుర్గ.

"బయట రిటైర్ అయినా ఈ రోజు మీ ఇంటికి 'జడ్జి' హోదాలోనే వచ్చాను. కోర్టువారి అనుమతి లేకుండా ఏమన్నా మాట్లాడావంటే కోర్టువారు ఊరుకోరు, గుర్తుంచుకో" అన్నారాయన.

అందరూ నవ్వేశారు.

"ఇక మొదలు పెడదామా?" అడిగారాయన కుర్చీలో కూర్చోబోతూ.

# సింగరాజు రామచంద్రమూర్తి

"మీ ఇష్టం" అన్నాడు శ్రీకాంత్.

"కూర్చున్నానంటే మీ మావయ్య గారిని కాదు గుర్తుంచుకోండి. మాకు అలవాటు కద - కుర్చీలో కూర్చోగానే కోర్టు మమ్మల్ని ఆవహిస్తుంది. ఎన్ని సంవత్సరాల అలవాటు మరి. సరే, కూర్చోబోతున్నాను. ఏవరేం చెప్పుకోవాలో చెప్పుకోండి. మీ ఇంటి సమస్యలకి నాకు తోచిన పరిష్కారం చెబుతాను. ఆచరించడం, ఆచరించకపోవటం మీ ఇష్టం!" అని నవ్వుతూ "ఇది నిజమయిన కోర్టు కాదు. నేను అధికారంలో ఉన్న జడ్జీని కాను కద! రిటయిరయిన వాడినాయె! - కనుక నా నిర్ణయాన్ని అమలు జరిపించే అధికారం నాకు లేదు." అన్నారాయన.

"అలాకాదు. మీరు ఏం చెబితే అది చేద్దామనే కద మావయ్యగారూ మిమ్మల్ని పిలిచింది. మొన్నటిదాకా న్యాయాధికారి మీరు! అంతకన్న ముఖ్యం మా కుటుంబానికి స్నేహితులు. లేకపోతే మీ అంతటి వారిని ఇంటికి రప్పించగలమా? మీరు చెప్పిన సలహాలు తుచ తప్పకుండా ఆచరిస్తామని హామీ ఇస్తున్నాను" అన్నాడు శ్రీకాంత్.



"కూర్చుంటున్నాను" అంటూనే కూర్చుని, కాసేపు కళ్ళుమూసుకుని తరువాత "ప్రతి కుటుంబంలోనూ సమస్యలు ఉంటాయి. లేనని ఎవరన్నా అంటే వాళ్ళు నిజం చెప్పడం లేదన్నమాట. ఇప్పుడు మీ కుటుంబంలోనూ అలాగే అందరి మనసులకు కష్టం కలిగించే విషయాలుండవచ్చు." "అవి ముందుగా అన్నపూర్ణమ్మగారు .... మీరు చెప్పవలసింది చెప్పండి. మరో మాట అందరిముందు చెబితే ఒకరి అభిప్రాయాలు ఒకరికి తెలుస్తాయి. అలా కాదు, ఒంటరిగానే చెబుతాను అంటే వీళ్ళందరిని బయటకు పంపుతాను" అన్నారు.

"ఇందులో దాచే విషయం ఏమీలేదు. ఎవరిమీనా కోపమూ లేదు. కాకపోతే పెద్దదాన్ని కనుక మనసుకి కష్టం వేసి... అదికూడా వినేశారు చెప్పమంటున్నారు కనుక చెప్పడం కానీ"...

"మీరు నేరుగా మీ మీ మనసులోని కష్టం ఏమిటో చెప్పటం మంచిది" అన్నారు జానకీపతిగారు.


"నేను నా పిల్లల నందర్నీ అతి ప్రేమగా పెంచుకున్నాను. అయితే మళ్ళీ అందులోనూ నా పెద్దకొడుకు శ్రీకాంత్‌ని మరికొంచెం ఎక్కువగా పెంచాను. చిన్నతనం నుంచి అనారోగ్యపువాడు కావటాన మీ బావగారికీ నాకూ కూడా...."

జానకిపతిగారు అడ్డంపడ్డారు. "ఈ కాసేపు మీరు కోర్టులో ఉన్నట్టు మాట్లాడాలి"

ఆవిడ తెల్లబోయి, అంతలో సర్దుకొని "సరే. అయినా, నేను కూడా వీడు ఎప్పుడు మా చేయి జారిపోతాడో నన్న భయంతోనే ఉండేవాళ్ళం. అంత అనారోగ్యం వీడిది. వూరిలో ఏ జబ్బులు ఎవరికి వచ్చినా వెంటనే వీడికి అంటుకునేవి. జలుబులు, ఫ్లూలు అట్లమ్మలు ఒకటేమిటి అన్నీను! పుట్టగానే మగబిడ్డ ఇలా అయ్యాడేమా అని బాధ పడుతూండేదానిని. అప్పటికి రెండవవాడు కలి పుట్టలేదు, చాలాకాలందాకా నాకు వీళ్ళిద్దరే - శ్రీకాంత్, దుర్గ సంతానం.

వీరిని తిప్పని గుడి, చూపించని గోపురం ఉండేవికావు. ఈ చుట్టుప్రక్కల ఎవరు వాడి ఆయుస్సు పెంచుతారని పిస్తే అక్కడికి తీసుకువెళ్లేదాన్ని. ఉదయమే పితికిన పాలు తాగించేదానిని.

మా అదృష్టం అనండి ....ఇప్పుడింకెవరి అదృష్టమనండి — వాడు చదువులో మాత్రం రేసు! వాడి ఆరోగ్యం కోసం చేసిన పనులన్నీ వాడికి మెదడుకి వెళ్ళినట్లున్నాయి! స్కూల్లో ఫస్టు. కాలేజీలో ఫస్టు. అందువల్లనే వెంటనే ఇంజినీరింగ్ సీటొచ్చింది. శక్తి లేకపోయినా అందులో చేర్పించాము. ఆయన కొచ్చే జీతంలో ఎలా తట్టుకోవడం? చూస్తూ చూస్తూ వీడి ఉత్సాహాన్ని చంపలేక, అంతెత్తు ఎగిరే స్తోమతలేక సతమతమయిపోయారాయన.



నా వంటిమీదనున్న బంగారం తాకట్టు పెట్టడం వీడికి జీతాలు కట్టడం, మళ్ళీ డొక్కలు మాడ్చుకుని అది విడిపించుకోవడం - అదీవరస! వాడికి మాత్రం మళ్ళీ అందులోనూ ఫస్టుమార్కులే! చివరికి ఈ పిల్ల పెళ్ళికి గానీయండి, వాడి ఉద్యోగం ప్రయత్నం కానీయండి, ఆ బంగారం కాస్తా నా ఒంటిమీద నుంచి శాశ్వతంగా వెళ్ళిపోయింది. "పోనీలే, పిల్లాడికి ఉద్యోగం వచ్చింది, పిల్ల ఒకింటి దయింది" అని తృప్తిపడ్డాను. కాని చిన్నతనం నుంచి అలవాటేమో, నా మెడవంక ఆయనా చూడలేకపోయేవారు. నాకూ ఎక్కడికి వెళ్ళబుద్ధయేది కాదు!

కాపరానికి వచ్చినపుడు అత్తగారు, మావగారు, ఆడబిడ్డలు, మరుదులు-మాది

ఉమ్మడి కుటుంబం. ఆయన జీతం, నా రక్తం వాళ్ళకిందనే ఖర్చయాయి. ఒక ముద్దూముచ్చటా ఎన్నడూ తీరినది లేదు. అసలు మాట్లాడుకునేందుకే తీరిక ఉండేది కాదు. చిక్కినా ఎవరేమను కుంటారోనన్న భయం. ఒక మంచిబట్ట కట్టుకోవాలన్న మనసూ తీరలేదు. "మన లాంటి కుటుంబాల్లో అటువంటి కోరిక లుండకూడదు అన్నపూర్ణా" అంటూండే వారాయన. కాని మనిషన్నాక, నలుగుర్నీ చూస్తున్నాక మనము అలా ఉండాలన్న కోరిక కలగడం సహజం కద!

వారినందరిని సాగనంపేసరికి పిల్ల లందుకున్నారు. ఇకనంతే. కడుపు కట్టుకోవడం రెండు చీరెలు చాలనా అనుకోవడం- ఉన్నదంతా మిగిల్చి వాళ్ళ కింద ఖర్చుపెట్టడం!

ఇప్పుడిక జీవితానికి మిగిలిం దేమిటి? మొన్న మొన్న వచ్చిన వాళ్ళు వాళ్ళవాళ్ళ కాపరాలు చక్కగా దిద్దుకుం టూంటే ముచ్చటేస్తుంది. మనమూ ఇలా స్వార్థంతో అయినవారినందరిని కాదని వేరే కాపురం పెట్టుకుని ఉంటే బాగుపడే వాళ్ళమేమో ననిపిస్తుంటుంది కూడా!

మా అబ్బాయికి మనసు కష్టంవేస్తుం దేమో కాని ఈరోజు అందరి మనసుల్లోని మాటలు చెప్పుకోవచ్చన్నారు కనుక చెబుతున్నాను. అమ్మ మంచిబట్ట కట్టు కున్న రోజులు పీడప్పలు చూడలేదు కనుక అమ్మకి కూడా మంచిబట్టలు కట్టుకోవాలని ఉంటుందన్న ధ్యాస కల గదు. అది సహజం కూడా! నాలుగు రూపాయలు మిగులుతే కోడలికి కొంటాడు. రైతే- చిన్నపిల్లలుంటే మయిన దాని అలంకరణ రాణిస్తుంది కూడా!

కాని "అమ్మ మెడలో గొలుసు ఏమ యింది, ఎలా ఖర్చయింది? ఆవిడకి మళ్ళీ అమర్చాలి" అన్న ధ్యాసకూడా రాదు! అవును రైటే. వయసులో ఉన్నపిల్లకి ఉన్నదీ మన్నదీ పెట్టి చేయిస్తే ముచ్చ టగా ఉంటుంది. రేపు వాడి కుటుంబంలో ఉండిపోతుంది బంగారం! నీ ఒంటిమీ దయితే- ఆడపిల్లలు ఆశపడితే? ఏదయిన బంగారం ఏటూ ఖర్చయిపోతుంది కద అని అపి, ఒక్కనవ్వు నవ్వి "అయినా ఆయన పోనే పోయారు. ఇక అందాలు. అలంకారాలూ నా కెందుకు? ఆయన జీతం డబ్బులు ఏనాడూ నా చేతిలో పోయనే లేదు. మొదట్లో వాళ్ళ అమ్మ చేతికిచ్చేవారు. తరువాత పోసేందుకు అసలు ఇంటికి ఏమయినా వస్తే కదా? వారిలో అందరికీ ఇచ్చుకుంటూ వచ్చే సరికి ఇంచ, బొక్క మిగిలేది.

కడిపెడు కండలోని కిస్తాం. వంటి మీద బంగారం చిన్నంతో సహా ఊడ్చి చదివించాం. అంతవరకే అది ఆ జీతం పుచ్చుకునే అదృష్టానికి నోచుకోవాలి. తరం మారిపోయింది. ఇప్పుడు భార్యని సుఖపెట్టడమే అందరి లక్ష్యం. కాని

అందరూ అలా ఉంటే బాగానే ఉండును. మా పెద్దదాని జీవితం . . "

ఇక్కడ జానకీపతిగారు "ఆపండి ఆ అమ్మాయి విషయం ఆ అమ్మాయే చెప్పుకుంటుంది. మీది అయిపోయిందన్న మాట. దుర్గాంబా— మీరు చెప్పుకోండి యిప్పుడు" అన్నారు.

లేచి నిలబడింది దుర్గ. "నా జీవితం నాశనం అయిపోయింది. ఎవరికీ చెప్పుకోలేదింతవరకూ నా బాధ.... మా అమ్మ చెప్పినట్లు నాకు బుద్ధి తెలిసినప్పటినుంచి మా శ్రీకాంత్ 'చదువు' అన్న యజ్ఞంలో మా నాన్న అలిసిపోయారు. ఎప్పుడూ ఆయన కళ్ళు దేని కోసమో వెతుకుతున్నట్లుండేవి. అది డబ్బు యానన్నమాట. ఆయన అనుభవించిందీ లేదు. ఇదిగో వీడికోసం—వీడి ఆరోగ్యంకోసం మొదట, చదువుకోసం తరువాత.

నన్ను గురించి ఒక్క సంఘటన చెబితే చాలు, వీడివల్ల నేనెంత నష్టపోయిందీ తెలిసిపోతుంది.

నన్ను చూసేందుకు ఒక డాక్టరుగార్ని తీసుకొచ్చారు మీరు— క్షమించండి. మా కుటుంబ స్నేహితులు. ఆ అబ్బాయికి నేను నచ్చాను. ఇరవై వేలు కట్నం అడిగారు వాళ్ళు. మా నాన్న ఇవ్వలేకపోయారు. అయితే ఆతను నన్ను తప్ప ఇంకెవరినీ చేసుకోనని భీష్మించాడట. ఇక్కడ మరో మాట చెప్పాలి. నన్ను పెళ్ళిచూపులు చూసినవారంతా నన్ను తప్ప ఇంకెవరినీ చేసుకోనన్నవారే. కాని భగవంతుడు అందం ఇచ్చినా మంచి జీవితం ఇవ్వలేదు.

మా నాన్నగారప్పుడే ఇదుగో వీడి చదువులో మునిగినా, తేలనూలేక ఉన్నారు. చివరికి పన్నెండు వేలకే వచ్చారు వాళ్ళు. ఆ తరవాత అసలు వేసే ఎప్పుడో కబురంపారు — పదివేలు ఇవ్వమని, మిగిలిన రెండు వేలూ ఒనే ఇస్తానని ఈ మాట ఎవరికీ చెప్పొద్దనీను.

అవి ఇవ్వలేక వదిలేశారు ఆ సంబంధం. నా ప్రాణం గిలగిల్లాడిపోయింది. కాని ఆడపిల్లని — ఏం చేయను? ఎవరికి ఇదుగో మా నాన్న గొడసును అమ్మి నాకు ఎనిమిది వేలు కట్నం ఇచ్చి పెళ్ళి చేశారు. ఆయనగారు గుమాస్తా. మా నాన్నలాంటి.' అమ్మలాంటి జీవితం మళ్ళీ మొదలు నాకూనూ. నా అదృష్టాన్ని మార్చింది ఆ రెండు వేలే. అదీ వీడి చదువువల్ల మునిగిపోవడంవల్ల కాని లేకపోతే మా నాన్న తల తాకట్టుపెట్టయినా తెచ్చేవాడు. అంటే నా జీవితం మార్చింది వీడే. ఇప్పుడు ఒక్క పూట పెట్టేందుకు మొగుడూ పెళ్ళాం ముఖాలు చూసుకుంటాం. వదిలేయండి— నాకు ఎంత యోగమో అంతే దక్కుతుంది. వీళ్ళెంతకాలం ఇవ్వగలరు!

చూసీనండి. అసలు దురదృష్టం ఏమంటే మేమున్న ఇంటికి ఎదురుగానే

ఇప్పుడీ డాక్టరుగారు ఇల్లు కొన్నారు. వాళ్ళావిడ ఏమీ బాగుండదు. కాని బాగా డబ్బుగలవారి పిల్ల. కారులో వెడుతుంటాను రోజూ ఇద్దరు. అవన్నీ రెండు వేలకి పోయాయి నాకు!

కిటికీలోంచి చూస్తుంటాను తప్పిపోయిన నా అదృష్టాన్ని. మొన్న వొక రోజున అలాగే చూస్తున్నాను, వీధి తలుపు తీసి ఉందని చూసుకోలేదు. ఎప్పుడొచ్చాడో డాక్టరు వచ్చి నన్ను గట్టిగా పట్టుకున్నాడు వెనుక నుంచి.

ఎవరా అని చూస్తే అతను "ఛీ" అని వదిలించుకున్నాను. 'లేదు దుర్గా, ఆనాటికీ, ఈనాటికీ, ఏనాటికీ నువ్వంటే నాకు ఒకరీతి అయిన ఇష్టం. అప్పుడు నా దగ్గర డబ్బు లేదు మా నాన్న కోసం చెల్లెళ్ళ కోసం అడిగావు ఆ కట్నం! ఇప్పుడు నా దగ్గర వేలున్నాయి, అవి లక్షలవుతాయి. కాని దుర్గా నువ్వు దూరమయ్యావు. అలా వీల్లేదు' అంటూ నన్ను ఆపేసింది దుర్గ.

కాసేపటికి తనే సర్దుకుని "ఎడంగా నిలబడండి డాక్టర్, డబ్బు లేక పోయినా నిప్పులాంటి దాన్ని ఏమనుకున్నారో" అంది.

'వన్నర్థం చేసుకోండి దుర్గా నాదవుతుందనుకున్న మనిషి నా కళ్ళ కెదురుగా ఉండి, నాకన్న ఎంతో తక్కువ స్థితిలో ఉండడం — రోజూ నేనెంత బాధపడుతుంటానో తెలుసా దుర్గా మీకు? ఐ లవ్ యూ' అన్నాడు.

"మీకన్న తక్కువ స్థితి నాకేమీ లేదు, ఉన్నంతలో తృప్తిఉంది నాకు. వెళ్ళండి, మళ్ళీ ఎప్పుడూ రాకండి" అన్నాను గట్టిగా.

'ఎప్పుడన్నా, ఎటువంటి అవసరం వచ్చినా — డాక్టరుగా కాని, మనిషికి మనిషిగా, డబ్బు అవసరం గాని — నేను ఉన్నానని గుర్తుంచకోండి" అన్నాడు.

"రెండూ అవసరం లేదు, మీరు వెళ్ళండి" అన్నాను. ఆయన వెళ్ళిపోయాక ఏడ్చాను నా స్థితికి.


ఇది జరిగిన పదిరోజులకి మా ఆయనకి ఆ డాక్టరుతో పరిచయం కలిగి అది పెరగడం ఈయన ఆయన దగ్గరనుంచి అప్పుతెచ్చుకోవడం జరిగింది. చచ్చిపోయాను సిగ్గుతో.

నా జీవితమంతా కష్టపడి రెండువేలూ ఇచ్చేవాన్ని. ఇప్పుడు ఆ రెండు వేలూ పోగు చేసినా నా కా జీవితం రాదు కద! ఎవరంటారు దీని క్కారణం? వీడు.

వీడిప్పుడు బాగానే ఉన్నాడు — సంఘంలో ఇంజినీరుగా మంచి స్థానం. పలుకుబడి కలిగి! మరి నాకు!" ఆపేసింది దుర్గ.

కాసేపు నిశ్శబ్దం ఆవరించింది.

"ఇప్పుడు రెండవ ఆడపిల్ల - పేరు సులక్షణ" అన్నారు జానకీపతిగారు.




"చాలాకాలంగా అన్నయ్యకీ, అమ్మకీ చెప్పా లనుకుంటున్నాను. కాని ధైర్యం చాలడం లేదు. ఇప్పుడు అవకాశం ఇచ్చారు- నేనూ, సుధాకర్ - అంటే మా ఇంటికి సరిగ్గా వెనక ఇంటివారి అబ్బాయి. ప్రేమించుకుంటున్నాము" అని తల వంచుకుంది.

అన్నపూర్ణమ్మగారు ఆ అమ్మాయి వంక ఆశ్చర్యంగా చూసింది.

"నాకు తెలుసు. మీ వదిన అనుమానించి చెప్పింది" అన్నాడు శ్రీకాంత్.

"సైలెన్స్. నువ్వు మాట్లాడమ్మా" అన్నారు జానకీపతిగారు.

"మా నాన్నగారు పోయేనాటికి నాకు పదిహేను సంవత్సరాలు. మా తమ్ముడికి పద్నాలుగు. నాన్నగారు పోయిన మూడేళ్ళగా మా అందరి భారం మా అన్నయ్యే భరిస్తున్నాడు. వాడికీ నాన్నగారు పోయాకనే పెళ్ళయింది. వాడికీ వేరుగా ఉంటే బాగుంటుందన్న కోరిక ఉండటం సహజం కదా! మేమందరం వాడిమీద బరువుగా ఉండటం మాకూ బాధగానే ఉంది. అమ్మకి చేయడం వాడికి విధాయకం. మాక్కూడా పెళ్ళయే దాకా వాడే బాధ్యుడనుకోండి. అందుకే ఎంత త్వరగా పెళ్ళి చేసుకుని బయటకి పోతే అంత మేలు వాడికి!

చిన్నప్పుడు నాన్నగారు మాకు మంచి బట్టలు ఇవ్వలేకపోయారు. కారణం అక్కయ్య, అమ్మ చెప్పనే చెప్పారు.

ఎప్పుడూ అన్నయ్య చదువుకి, అన్నయ్య హాస్టలుకి సరిపోయేవి ఇంట్లో ఉన్న డబ్బులన్నీ.

అమ్మనుంచి మాకు నగలు వారసత్వంగా రాకపోయినా ఆవిడ అందం మాత్రం భగవంతుడి దయవలన నాకూ, అక్కయ్యకీ అబ్బింది. దాని జీవితం ఎలా పాడయిపోయిందో అది చెప్పింది. అందువల్ల నేను చెప్పేదేమంటే ఆడపిల్ల పెళ్ళిదగ్గర ఎప్పుడూ లోభించకండి. మా జీవితమంతా ఎలా జరగాలో నిర్ణయించేది మీరే. అందువల్ల అక్కడ మాత్రం వెనకాడకండి. తరువాత మీ ఆర్థికస్థితి బాగుపడితే మాకు తాత్కాలికంగా ఉపయోగపడుతుందే కాని శాశ్వతంగా కాదు. అక్కయ్య కార్లో తిరిగేది ఆ రెండు వేలకీ నాన్నగారు వెనకాడి ఉండకపోతే.

మా అన్నయ్య కట్నం పుచ్చుకోలేదు. కాని అందరూ అలా ఉండరు ఈ లోకంలో. అందరి తల్లితండ్రులు మా అమ్మలాంటివాళ్ళూకారు, పుచ్చుకోకపోయినా పూరుకునేందుకు.

ఇప్పటికీ సుధాకర్ బాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. చాలా మంచి భవిష్యత్తు కలవాడు. కట్నానికి వ్యతిరేకి. అయితే అతనూ మధ్య తరగతికి చెందిన కుటుంబంలోని వాడు. కనుక వాళ్ళనాన్నగారికి అతను కట్నం తీసుకురావాలి. ఆ కట్నం పెట్టి అయన తన కూతురికి పెళ్ళి చెయ్యాలి.

మా అన్నయ్య వాళ్ళు అడిగిన కట్నం ఇవ్వలేదు. ఇవ్వలేక కాదు, ఇవ్వడు. 'నాకూ సంసారం ఉంది, రేపు పిల్లలు పుడతారు' అంటాడు. కట్నం ఇవ్వకపోతే సుధాకర్ వాళ్ళ నాన్నగారు ఒప్పుకోరు. అతనికి వాళ్ళ నాన్నని కాదనేందుకు మనసొప్పదు. 'పొగరుబోతు' అనిపించుకోవడం ఇష్టంలేదతనికి" అని పేలవంగా నవ్వి "మళ్ళీ అక్కయ్య జీవితమే నాదీ అవుతుంది. ఎక్కడో చిన్న బడిపంతులునో, గుమాస్తానో పెళ్ళాడి, అయనకి పిల్లల్ని కని అదే జీవిత పరమార్థమని జీవితాన్ని గడిపేయడం.

చిన్నప్పుడు డబ్బులేక కోరికలు తీరలేదు. అదే అలవాటు చేసుకుని కోరిక అన్నదానినే మరిచిపోతే పోలా? సుధాకర్ని మరిచిపోతే సరి" అంది.

ఈ ఆఖరి మాటలంటూండగా ఆమె గొంతు పూడిపోయింది. కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

జానకీపతిగారు "మాడమ్మా సులక్షణా! ఒక పని చేద్దాం. మే మెరుగున్న కుర్రాడు ఒకడున్నాడు. మంచి ఉద్యోగం గలవాడు. ఆదర్శాలూ కలవాడు. నువ్వు అందమయిన దానివని నువ్వే చెప్పావు. కనుక అతను కాదనడు బహుశ. పైస కట్నం లేకుండా నీకు అతనితో పెళ్ళి చేయిస్తాము. సరా?" అనడిగారు.

సులక్షణ మాట్లాడలేదు.

"చూశావా, నీ కిష్టం లేదన్న మాట." అన్నారాయన మళ్ళీ.

ఆమె తల వంచుకుని కాలి బొటన వేలితో నేలమీద రాస్తూండిపోయింది.

"కనుక నీ సుధాకరుడ్ని తప్ప మరొకర్ని చేసుకోవు. అవునా ?"

అవునన్నట్లు తల గబగబ ఊపింది. ఆ కదలికకి ఆమె కన్నీళ్ళు అటు ఇటు ఎగిరిపడ్డాయి.

నవ్వారు జానకీపతిగారు. "కట్నం గురించి మాట్లాడటం తప్పనుకో. కాని విషయం వచ్చింది కనుక మాట్లాడాను. తప్పదు. పదిహేను వేలు, ఇరువయి వేలు చేసే కుర్రాడు నిన్ను చేసుకుంటా నంటే నువ్వు కాదంటున్నావు. అంటే, పదిహేను ఇరవయి వేలు కాలితో తన్నేశా వన్నమాట ! అలాగే నీ సుధాకరుడు ఎందుకు తన్నేయడు ?"

గభాలున తలెత్తింది సులక్షణ ఆ ప్రశ్నకి.

"అనుగమ్మా ఆ ప్రశ్న అతన్నే కాదన్నాడంటే అతన్నే నువ్వు కాదన్న ఇవతలకి రా. బ్రతకలేకపోవు సరే. తరువాత వాడు రెండవ కుమారుడు నాలుగవ సంతానమూ అయిన శశిధర్. నువ్వు చెప్పవలసింది చెప్పవోయ్" అన్నారాయన.

"నాదేముందండి, ఇంకా చదువుకునే కుర్రాడిని కదా ! నా కంప్లెయింట్ కూడా చదువు గురించే ఉంటుంది. చిన్నతనం నుంచి చదువు తప్ప మరో ధ్యాస లేని వాడిని. మా నాన్నగారి పుణ్యం మా అన్నయ్య పుణ్యం వలన ఖరీదయిన బట్టలు ఖరీదయిన అలవాట్లు లేవు. అటు వంటివి ఉండాలన్న కోరికా లేదు నాకు. ఎప్పుడూ మా అన్నయ్యే ఆదర్శం. వాడు అతి సాదాగా ఉండేవాడట. ఉండవలసిన అవసరం మాది. మా నాన్నగారి ఆదాయం, ఆ ఆదాయంలోనే అన్నయ్యని చదివించవలసి రావడం అక్కయ్యకి పెళ్ళిచేయవలసి రావడం వగయిరా చెప్పాలా పైగా ఖర్చు. నేను చెప్పడం అనవసరం.

చెప్పాను గదా నాకు అన్నయ్య ఆదర్శమని. అందుకని వాడిలాగే ఇంజనీరుని కావాలన్నదే నా కోరిక. ఆ ధ్యేయంతోనే చదివాను. వాడు ఇంజనీరు కాగలిగాడు నేను కాలేకపోతున్నాను— సీటు రాలేదు కనుక. అదొక్కటే తేడా 'ఎందువలన రాలేదు ?' అన్నది వాడు అడగడు. నేను చెప్పినా వినిపించుకోడు. ఎందుక నంటే వాడే దీనికి కారణం కనుక ఇప్పుడు ఈ మాటలు చెప్పుకునే అవ కాశం మీ రిచ్చి నందుకు నేను కృతజ్ఞుడ్ని !

మా అన్నయ్య చదివిన రోజులలో ఇంటర్‌లో ఇప్పటిలాగా తొంభయి నాలుగుపైన రానవసరంలేదు మార్కులు. ఇంత రష్ ఉండేది కాదు. ఇంజనీరింగ్ కాలేజీ సీట్లకి. ఇప్పుడు ప్రతివాడి ధ్యాస ఇంజనీరింగ్, మెడిసన్లే కదా. మిగిలిన

వాటికి ఉద్యోగం వస్తుందన్న ఆశకూడా లేకపోయే। ఇ దుకని ఇంటర్‌లో కాలేజీలో చేర్పించడం అన్నిటికీ ప్రయివేట్లు ఏర్పాటుచేసి ఒక సైకిల్ కొనివ్వడంతో చేర్పించినవాడి పనయిపోతే అప్పటినుంచే చేరినవాడి పని మొదలవుతుంది. ఎండా, వానా, జ్వరమూ ఇటువంటివి లక్ష్య పెట్టకుండా ఈ ప్రయివేట్లకి తిరగడం, వాళ్ల చెప్పిననోట్సు బట్టీపట్టడం. పరీక్షల్లో తు. చ. తప్పకుండా దించడం। నూటికి తొంభయి ఎనిమిది తెచ్చుకోవడం।

నాకు ఒక్క లెక్కలు మినహాయించి మిగిలినవాటిలో ప్రయివేట్లు లేవు. తన వల్ల కాదన్నాడు అన్నయ్య. మార్కులు కూడా 'సారి' అన్నాయి నాకు. నూటికి ఎనభయి దాటలేదు।

'కాలేజీలో చెప్పింది చాలదా।' అన్నాడు అన్నయ్య ఈ మాట అంటే.

'కాలేజీలో చెప్పరు. ప్రయివేట్లలోనే చెబుతారు' అన్నాను. వాడికి అర్థం కాలేదు. ఇంకా ధర్మయుగం అనుకుంటు న్నాడు.

నా విన్నపం ఏమంటే- ఉద్యోగం అంటూ వస్తే తీర్చుకుంటాను, ఇంజనీరింగ్‌కి పాతికవేలు డొనేషన్ కట్టమని. అంతే" అన్నాడు శశిధర్.


"శ్రీకాంత్ నువ్వేమన్నా చెప్పుకోవాలా బై వే ఆఫ్ రిప్లై- సమాధానం అన్నమాట" అన్నారు జానకీపతిగారు నవ్వుతూ.

శ్రీకాంత్ కూడా నవ్వి, "ఏంలేదు సార్. నా చిన్నతనం నుంచి వరుసగా ఇప్పటిదాకా కథ చెప్పినట్లు చెప్పేశారు నలుగురూ కలసి అయితే చిన్న అపాయిం టేమిటంటే మా నాన్నగారు పోవడం, నాకు ఉద్యోగం రావడం ఒకేసారి జరి గాయి. ఇంచుమించుగా అప్పటినుంచి మొత్తం కుటుంబ బాధ్యతంతా నేనే వహిస్తున్నాను. అంతకు మించి చెప్ప వలసిందేమీ లేదు" అన్నాడు.

"ఇక మిగిలినది ఇంటి కోడలు వసుంధర. 'ఏమ్మా మరి నువ్వు చెప్పవూ? ఎవరిమీదయినా మనసులో కష్టం ఉంటే చెప్పేయొచ్చు. ఈ రోజు ఎవరూ ఏమీ అనుకోరు" అన్నారు జానకిపతిగారు.

"అలాగేనండి. మొదట అసలు నా కివన్నీ ఎందుకని అనిపించిందండి. అయితే ఇప్పుడు రెండు మాటలు చెబుతానండి ఏ ఆడపిల్లయినా మగపిల్లాడిని పెళ్లిచేసుకునేది అతని చదువుని, ఉద్యోగాన్ని, ఆస్తి అంతస్తుని చూసే కదండి। మరి అవన్నీ ఆ ఆడపిల్లకే చెందుతాయి కదండీ। ఆ ఉద్యోగం, చదువూ లేకుండా ఉంటే కుర్రాడి ఇంటికి ఆడపిల్ల తండ్రి అసలు వెళ్ళనే వెళ్ళడు కదండీ।

కనుక, గొప్ప గొప్ప సంబంధాలు- అంటే ఇంజనీర్లు డాక్టర్లు వంటి సంబంధాలకోసం ఆడపిల్లల తండ్రులు వెతికేది పిల్ల సుఖపడుతుందనే కదండి।




నేను చెప్పేదానికి ఎవరూ ఏమీ అనుకోకండి. 'అనుకోరు' అన్నారు కనుకనే అసలు చెబుతున్నానండి. ఆయన ఉద్దేశాలు కావండి ఇవి. నావీ కావండి. ఇప్పుడిప్పుడే వచ్చిన ఆలోచనలండి ఇవి.

ఆడపిల్ల సుఖపడాలని మంచి కుర్రాడి కిచ్చి చేస్తారు. ఇందాక మా వదినగారు అన్నది కదండి "ఆ డాక్టరునే చేసుకుని ఉంటే కారులో తిరిగేదాన్నని." ఏ తండ్రి కయినా అదే కదండి కోరిక. ఆ పిల్ల కయినా అదే కదండి కోరిక. సంపాదించేవాడు, మంచి హోదా కలవాడు భర్త కావాలని.

ఆ తరువాత సంతానం కూడా తగ్గించుకుని అప్పుడు కావలసిన అధునాతనమయిన పరికరాలన్నీ కొనుక్కోవాలి, అంటే గ్రైండర్, ఫాన్లు, స్కూటర్ వంటివి కొనుక్కోవాలి, ఆ పైన ఇల్లు కట్టుకుని హాయిగా కాలం గడపాలనే కదండి కోరిక.

మరి అటువంటప్పుడు పెళ్ళయిన రోజుకే నలుగురయిదుగుర్ని పోషించి, చదివించి, పెళ్ళిళ్ళు చేయవలసిన బాధ్యత ఉంటే ఇంకో వాళ్ల వాళ్ళ సంతానాన్ని తగ్గించమనటం మాత్రం ఉపయోగం ఏముంటుందండీ?

అన్యాయమని కాదు కానండి జనం కన్న తరువాత వాళ్ళు ఎదుగుతూ, పెళ్ళి చేయాలి కదండి. అవి ఇంకొకరు చేయాలసి వస్తే వాళ్ళు ఇంకెప్పటికి

కోలుకుంటారండి? వాళ్ళ చదువులు, పెళ్ళిళ్ళు, ముద్దులూ, ముచ్చట్లూ అయ్యేలోపలికి వాళ్ళ సంతానం పెరిగి వచ్చేస్తారు. ఇంకా ఊపిరి తీసుకునే పైమేదండి?

అటువంటి పరిస్థితిలో ఇంకా అలా చేయలేదు, యిలా చేయలేదు అనడం ధర్మమా మీరే చెప్పండి!" గభాలున ఆపేసింది వసుంధర.

అన్నపూర్ణమ్మ తెల్లబోతూ ఆమె వంక చూసింది. వసుంధర తల వంచు కూర్చుంది.

ఒక్క అయిదు నిముషాలు ఎవరూ మాట్లాడలేదు. అప్పుడు జానకీపతిగారు మొదలుపెట్టారు. "పెళ్ళయిన కొత్తలో ఆ భార్యాభర్తల మధ్య శారీరక సంబంధమే ముఖ్యమైనది. అసలు ఆ ఆకర్షణ లేకపోతే ఆడపిల్లలు వాళ్ళ సర్వస్వం వదిలి ముక్కూమొహం తెలియని ఇంటికి వెళ్ళి వాళ్ళతో కలిసిపోరు.

తరువాత ఆ సాన్నిహిత్యం వల్ల వాళ్ళిద్దరి మధ్య ప్రేమ పెరుగుతుంది. ఒకరినొకరు అర్థం చేసుకుంటారు. ఇంతలో సంతానం కలిగి వారి అనుబంధాన్ని మరింత గట్టిపరుస్తుంది!

కనుక, మనకు కలిగే సంతానం కొంతవరకు మన కోరికల ప్రతిరూపం. అందువల్ల వాళ్ళని ఈ లోకంలోకి తెచ్చాం. వాళ్ళు మనల్ని పూజించాలి అనుకోవడం తప్పు!

పుట్టాక పెంచడం మన ధర్మం! చదువు చెప్పించటం మన కర్తవ్యం.

అయితే ఎటువంటి చదువు? వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడేందుకు వీలు కలిగించే చదువు. మన శక్తికి మించని చదువు.

అన్నపూర్ణమ్మగారూ, వింటున్నారా? కనుక చదువు చెప్పించడంలో మీరేదో త్యాగం చేశాననుకోకండి. అయితే మీ స్తోమతుకి ఇంజనీరింగ్ చెప్పించడం అన్నది త్యాగమే!

దానికి అతను మీకు ఋణపడి ఉన్నాడు. మిమ్మల్ని చూడవలసిన బాధ్యతని మీరు అతనికి ఆ విధంగా అంటగట్టారు. మిమ్మల్నతను పోషించి తీరాలి.

మరో విషయం. శక్తికి మించిన చదువును చదివించడం మిగిలినవారిని అన్యాయం చేయటమే అవుతుంది. అదే మీరు చేసినది! పిల్లలని చదివిస్తున్నా పెళ్ళి చేస్తున్నా ఒక్కటే ఆలోచించుకోవాలి. 'మిగిలిన వారికన్నా ఇంతే చేయగలమా లేదా?' అన్నది. మీ భార్యాభర్తలు ఆ ఆలోచన చేసినట్లు లేదు.

దుర్గాంబకు తను నష్టపోయానన్న భావన కలగడంలో తప్పులేదు. ప్రత్యక్షంగా మీరు, మీ భర్తగారు, పరోక్షంగా మీ అబ్బాయి శ్రీకాంత్ అందుకు బాధ్యులు! ఆమెకు కలిగిన నష్టాన్ని పూడ్చే శక్తి మీకు లేదు కనుకా, మీ భర్త పరమపదించారు కనుకా మీ శ్రీకాంత్ బాధ్యత మాత్రం మిగిలింది" !

దుర్గ రాగోగులు చూస్తుండవలసిన కర్తవ్యం శ్రీకాంత్‌కి ఉంది. అదీ ఆమెకు ధర్మం చేస్తున్నట్లు కాదు. తన ధర్మం తను నెరవేరుస్తున్నట్లు.

సులక్షణ విషయం ఇందాకనే చెప్పేశా.

ఇక శశిధర్.

అనతిక్రాంతం ప్రాథమికమయిన వివరణ అవసరం. ఎవరూ శక్తికి మించిన పనులు చేయరాదు. సంతానం కూడా అంతే!

ఇక్కడ శ్రీకాంత్ భార్య వసుంధర అడిగిన ప్రశ్నలు గుర్తుంచుకోదగినవి. ఎవరో- వారు తండ్రే కావచ్చును- ఎవరో కన్న సంతానంతోనే జీవితమంతా సతమతమయిపోతే ఇంక ఈ కొత్త దంపతులు జాగ్రత్తపడి బాగుపడేదెప్పుడు? వీళ్లు ఒకరూ, ఇద్దరూ పిల్లల్ని కని మాత్రం ఉపయోగం ఏమిటి?

కనుక ఈ శశిధర్ అందులోకి వస్తాడు. అన్నపూర్ణమ్మగారు, వారి భర్తయొక్క తాహతుకి మించిన సంతానం ఇతను.

ఆ బాధ్యతని నోరెత్తకుండా స్వీకరించిన శ్రీకాంత్‌ని అభినందిస్తున్నాను. శ్రీకాంత్ ఏమి చదివిస్తే అది చదువుకోవలసిన ధర్మం శశిధర్‌ది.

ఇక ఇంటి కోడలు వసుంధర మిగిలింది" అని ఆయన ఒక కాగితంమీద ఏదో వ్రాసి, కవరొకటి తెప్పించి, అందులో పెట్టి అతికించారు. అప్పుడు "అన్నపూర్ణమ్మగారూ, మీరీ కవరు అందుకోండి. ఎప్పుడు మీ కోడలి విషయంలో మీ మనసుకి కష్టంవేసినా ఈ కవరు చించి లోపలిది చదువుతే మీకు ఏం చేయాలో తెలుస్తుంది. ఇప్పుడు మీరంతా ఒక్కసారి బయటికి వెళ్ళండి. నువ్వు మాత్రం ఉండమ్మా వసుంధరా" అన్నారు.

వసుంధర ఒక్కతీ నిలబడి ఉంది తలవంచుకుని.

"ఇందాక నువ్వు చాలా బాగా మాట్లాడావు. నువ్వడిగిన సందేహాలు మంచివి. అయితే ఇక్కడొక సూక్ష్మం ఉంది. అదే ఆ కవర్లో రాసి అతికించి అవిడకిచ్చాను. అదేమంటే –

మీ ఆయన చదువు ఉద్యోగం అన్నీ చూసి చేసుకున్నావు. ఎరి నిజమే! కాని శ్రీకాంత్ [illegible] నుంచి పైనా కట్నం తీసుకుంటే ఆ ఉద్యోగం, చదువు అన్నీ [illegible] నీకు హక్కు వచ్చేసేది!

ఏమీ తీసుకోకు నీకు ఆ హక్కు లేకుండా చేశాడు! వాళ్ళమ్మ కష్టపడి చదివించుకుంది. అతని మీద కట్నం తీసుకుని ఉంటే ఆమె అతని సంపాదన మీద అధికారం పోగొట్టుకునేది!

నువ్వు అతని అర్ధాంగివి మాత్రమే! అతనికి యజమానురాలివి కావు.

వసుధ! మంచిదానివి అలాగే ఉండు. మాటలు విని మారబోకు" అన్నారాయన.

వసుంధర నవ్వుతూ "అలాగేనండి బాబాయిగారు. అసలు నాకు ఆ ఉద్దేశాలు లేవండి. దుర్గ అంటుంటే అనేశాను. అంతే" అంది.

—•—